

గోడు గోడున.. : కేటీఆర్‌తో గోడు వెల్లబోసుకుంటున్న బాధితులు

నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 1 అక్టోబర్ 2024 | RANGAREDDY



రక్తం వద్దు.. రక్షణ ముద్దు : ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

# తెగించి కొట్లాడుదాం

## మూసీ బాధితులకు బీఆర్ఎస్ భరోసా • పేదలను ముంచే మూసీని ఎవరడిగిండ్రు: కేటీఆర్



**అవే ఆందోళనలు, అవే ఆవేదనలు, సుడులు తిరిగిన బాధితుల కంటనీరు ఓ వైపు... బరువెక్కిన గుండెలతో తన్నుకొచ్చే దుఖం మరోవైపు. దశాబ్దాలుగా పుట్టి, పెరిగిన ఇండ్లను కూల్చేందుకు వస్తున్న కాంగ్రెస్ బుల్డోజర్లు బడుగు జీవుల మనసులను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. మూసీ ప్రక్షాళన పేరిట సీఎం రేవంత్ రెడ్డి పేదల గూళ్లను కూల్చేసే కుట్రలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. తమ ఇంటిపై పడిన ఎర్ర గుర్తులను చూసి రోడ్డున పడనున్న తమ జీవితాలను తలుచుకుని విలపిస్తున్నారు. సోమవారం కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి బృందం నగరంలోని హైదర్‌గూడలోని లక్ష్మీనగర్, కిషన్‌బాగ్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి నిర్వాసితులను ఓదార్చింది. మూసీ అభివృద్ధి పేరిట పేదల బతుకులను సర్వనాశనం చేసే ప్రాజెక్టును అడ్డుకునేందుకు తెగించి కొట్లాడుదామని పిలుపునిచ్చారు.**

-సిటీబ్యూరో/మైలార్‌దేవ్‌పల్లి/అగ్రికల్చర్ వర్సిటీ/చార్మినార్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ)



**కిషన్‌బాగ్, హైదర్‌గూడలో** ఏర్పాటు చేసిన సంఘీభావ సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ''ఆడబిడ్డల కన్నీళ్లకు కారణమవుతున్న ప్రభుత్వం దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతున్నది.1906లో వరదలు వచ్చా యి. అప్పటి నిజాం ప్రభుత్వం ఇంజినీరింగ్ విశ్వేశ్వరయ్యను పిలిచి రెండు జంట జలాశయాలను నిర్మించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏనాడూ నగరానికి వరద ముంపు సమస్య రాలేదు. కానీ 2020లో కురిసిన కుంభ వృష్టితో ఒక్కసారిగా నగరం మునిగింది.అలాంటి పరిస్థితుల్లోనూ అప్పటి సీఎం కేసీఆర్ బాధితులకు అండగా నిలిచారు. పర్మిషన్లు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీయే... రిజిస్ట్రేషన్ చేసేది వారే, అనుమతులిచ్చేది వారే... ఇప్పుడు పేదల ఇండ్లను పేకమేడల్లా కూల్చేది వారే. నమామి గంగే ప్రాజెక్టుకు ప్రధాని మోదీ 2400 కిలోమీటర్ల గంగా నది ప్రక్షాళనకు రూ. 40వేల కోట్లు ఖర్చు చేశారు. కానీ 55 కిలోమీటర్లు కూడా లేని మూసీ ప్రాజెక్టు కోసం రేవంత్ రెడ్డి రూ. లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తానంటున్నారు. మూసీ ప్రక్షాళన చేయమని ఎవరడిగారని అన్నారు.

**మూసీ సర్వేకు** నిరసనగా నగరంలో మూడ్రోజులుగా ఆందోళనలు మిన్నంటుతున్నాయి. ఇన్నాళ్లు నీడనిచ్చిన తమ నివాసాలన్నీ మూసీలో కలుస్తున్నాయంటూ విలపిస్తున్నారు. కాంగ్రెస్ కుట్రలకు బలవుతున్న ఎంతోమంది బాధితులకు బీఆర్ఎస్ భరోసానిచ్చేలా మూసీ పరీవాహక ప్రాంతంలో పర్యటిస్తున్నది. సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, మహమూద్ అలీ, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి, కార్తీక్ రెడ్డితోపాటు పలువురు బీఆర్ఎస్ నేతలు హైదర్‌గూడ, కిషన్‌బాగ్ ప్రాంతాల బాధితులకు అండగా నిలిచారు. మీ ఇండ్లకు బీఆర్ఎస్ రక్షణగా ఉంటుందని, మీకు అండగా బీఆర్ఎస్ న్యాయ పోరాటం చేస్తుందని బాధ్యతను భుజాన వేసుకున్నది.

**కాంగ్రెస్ అధికారంలోకి** రాగానే ఆందోళనలు, ఆక్రందనలతో హైదరాబాద్ అల్లకల్లోలంగా మారుతుంది. నగరంలో బీఆర్ఎస్‌ను గెలిపించారనే కోపంతోనే రేవంత్ రెడ్డి మూసీ ప్రాజెక్టు పేరిట లక్షల మందిని రోడ్డున పడేలా చేస్తున్నారు. కొడంగల్‌లోని రెడ్డికుంటలో ఉన్న సొంతిళ్లు, దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ ఉన్న సోదరుడి ఇంటిని ముందుగా కూల్చివేయాలి. జంట జలాశయాల వెంబడి ఉన్న కాంగ్రెస్ పెద్దల భవంతులను కూల్చాలి. రెక్కల కష్టం చేసుకుని కూడబెట్టుకున్న పైసలతో మీరిచ్చిన రిజిస్ట్రేషన్లు, పర్మిషన్లు, కట్టిన ట్యాక్సులతో భావోద్వేగాలతో కూడిన ఇంటిని కూల్చేస్తానంటే ఊరుకునేది లేదు. మూసీ విషయంలో హైకోర్టు కూడా గట్టిగానే వాయించింది. హైకోర్టును మోసం చేసేలా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. మూసీ మార్కింగ్‌తో హైడ్రాకు సంబంధం లేదని కమిషనర్ రంగనాథ్ చెప్పుకోవడం సిగ్గుచేటు. డబ్బులిచ్చి మాట్లాడిస్తున్నారని మంత్రులు సిగ్గులేకుండా ఆరోపణలు చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి కూడా మీ వెనుకాల బడా బిల్డర్లు ఉన్నారని మాట్లాడుతున్నారు. సుప్రీంకోర్టు వరకు పోరాడి, సంఘటితంగా కాంగ్రెస్ గద్దలను ఎదుర్కోవాలన్నారు. చట్టాలపై బీఆర్ఎస్ లీగల్ సెల్ ద్వారా అవగాహన కల్పిస్తాం. మన్మోహన్ సింగ్ తీసుకువచ్చిన భూసేకరణ చట్టం ప్రకారం ప్రజల భూములు తీసుకోవాలంటే.. పరిహారానికి పలు విధానాలున్నాయి. మార్కెట్ విలువకు మూడింతలివ్వాలి. లేదా నిర్మాణ ధర, భూముల పరిహారం వేరుగా చెల్లించాల్సి ఉంటుంది. మీరు వేసిన ఓట్లతో గెలిచి, బుల్డోజర్లు దింపుతున్న నాయకులకు తగిన బుద్ధి చెప్పాలి. మీ ఇండ్లపైకి వచ్చే బుల్డోజర్లకు మేమందరం అడ్డుగా నిలబడతాం. ఎవరూ అధైర్యపడొద్దు. ఇక బీజేపీ నేతలు రేవంత్ పాలన సూపర్ అని ప్రశంసలు కురిపిస్తున్నారు. పేదల ఇండ్లను మూసీలో కలిపేందుకు సిద్ధమైన కాంగ్రెస్ విషయంలో బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదన్నారు.

### హైడ్రాతో భయపెడుతున్నారు..

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దిన కేటీఆర్ ఓవైపు.. పదేండ్లలో కేసీఆర్ పాలనతో ప్రశాంతంగా ఉందని మాజీ మంత్రి మహమూద్ అలీ అన్నారు. కానీ ఈ బద్మాష్ పాలనతో హైడ్రా పేరిట ప్రజలను భయపెడుతున్నారని మండిపడ్డారు. అధికారం చేపట్టిన అనతి కాలంలోనే పేదల పొట్ట కొట్టేలా మూసీ కోసం ఇండ్లు కూల్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధం అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇండ్లపైకి బుల్డోజర్లు తీసుకువచ్చే తీస్‌మార్‌ఖాన్లు నగరంలో ఎవరూ లేరనే విషయాన్ని మూసీ బాధితులు గుర్తు పెట్టుకోవాలని బీఆర్ఎస్ నేత కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు.

---

## ఇమ్లిబన్, మెట్రో స్టేషన్లను కూలుస్తారా?

**ప్రభుత్వాన్ని ప్రశ్నించిన నివాస హక్కుల ప్రచార పరిరక్షణ సమితి**

ఖైరతాబాద్ : మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న పేదలు, మధ్యతరగతి ప్రజల ఇండ్లు కూలుస్తున్న అధికారులు అదే పరిధిలో ఉన్న ఇమ్లిబన్ బస్ డిపో, మెట్రో స్టేషన్లను కూల్చివేస్తారా? అని నివాస హక్కుల ప్రచార పరిరక్షణ సంస్థ ప్రతినిధులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంస్థ కన్వీనర్ వర్గీస్ థేక్‌నాథ్, మానవ హక్కుల వేదిక ప్రతినిధి జీవన్‌కుమార్‌తో కలిసి మాట్లాడుతూ.. మూసీ పరీవాహక ప్రాంతాల్లో 90 శాతం పేదలే నివసిస్తున్నారని, ఎలాంటి పునరావాసం కల్పించకుండా కూల్చివేస్తే వారి అస్తిత్వానికి భంగం కలుగుతుందన్నారు. మలక్‌పేట్‌లోని జీహెచ్ఎంసీ లారీ స్టాండ్, ఉప్పల్ భగాయత్‌లోని ప్రభుత్వ భూమి పునరావాసానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ కోసమని చెబుతున్న ప్రభుత్వం ప్రజాభిప్రాయం సేకరించిందా? అని ప్రశ్నించారు. మూసీ పరీవాహకంలో ఉన్న నార్సింగి ప్రాంతంలో అనేక విల్లాలు, భవనాలు ఉన్నాయని, వాటిని ఎందుకు కూల్చడం లేదని ధ్వజమెత్తారు. మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజల తరపున నివాస హక్కుల ప్రచార పరిరక్షణ సంస్థ ప్రభుత్వంతో చర్చలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నదన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు సంధ్య, కె. సజయ, సంగమిత్ర, బిలాల్, లింగయ్య పాల్గొన్నారు.




## లక్షన్నర ఇండ్లకు మార్కింగ్!

### సుందరీకరణ పేరుతో మూసీలో ముంచేందుకు రంగం సిద్ధం

**పేదల గూడుపై ఎంఆర్‌డీసీఎల్ రెడ్ మార్క్**

**మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును అమలు చేసేందుకు హద్దుల ఖరారు**

**బఫర్ జోన్, ఎఫ్ఆర్ఎల్ హద్దులతో 45కిలోమీటర్ల మార్కింగ్ మ్యాప్**

**భయం గుప్పిట్లో మూసీ నివాసితులు**

**మూసీ ప్రక్షాళన పేరిట పేదల ఇండ్లను కూల్చేందుకు కార్యాచరణకు రంగం సిద్ధమైంది. మూడు జిల్లాల పరిధిలో దాదాపు 45 కిలోమీటర్లు ప్రవహిస్తున్న మూసీకి ఇరువైపులా పరీవాహక ప్రాంతానికి హద్దులను నిర్ధారించారు. బఫర్ జోన్, ఫుల్ రివర్ లెవల్ పేరిట హద్దులను గుర్తించారు. మూసీ నది ప్రక్షాళనకు సంబంధించి అలైన్‌మెంట్ మ్యాప్ ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్నది. ఈ మ్యాప్ ఆధారంగానే మూసీ వెంబడి ఆయా జిల్లాల రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసులు ఆస్తులకు మార్కింగ్ చేస్తుండగా.. ఇందులో రివర్ బెడ్ (రెడ్ లైన్), ఎఫ్ఆర్ఎల్ (బ్లూ లైన్) పేరుతో హద్దులను సర్కారు గుర్తించినట్లు తెలుస్తున్నది.**

#### హద్దుల కోసం ప్రత్యేక మ్యాప్..

మూసీ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు మూడు నెలల్లోనే అంచనా వ్యయాన్ని రూ.లక్షన్నర కోట్లకు పెంచేసి.. మూసీ బ్యూటిఫికేషన్ కాంగ్రెస్‌కు ఏటీఎంలా మారనుందనే విమర్శలతో పౌర సమాజం గళమెత్తింది. దీనికోసం రెవెన్యూ, ఇరిగేషన్, జియో మ్యాపింగ్ అధ్యయన సంస్థలతో కలిసి మ్యాప్‌ను రూపొందించిందని ఎంఆర్‌డీసీఎల్ వర్గాలు వెల్లడించాయి.

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : పేదలకు కంటి నిండా కునుకు లేకుండా చేస్తున్న మూసీ మార్కింగ్ ప్రక్రియ.. ఇప్పుడు హద్దులను ఖరారు చేస్తూ మరో పిడుగు వేసింది. రెండు జంట జలాశయాల నుంచి మొదలుకుని గ్రేటర్ పరిధి దాటేంత వరకు మూసీ వెంబడి రివర్ బెడ్, ఫుల్ రివర్ లెవల్‌తో దాదాపు 45 కిలోమీటర్ల పొడవున హద్దులను నిర్దేశించింది. ఇందులో రెడ్ లైన్‌ను రివర్ బెడ్‌గా పరిగణిస్తుండగా.. బ్లూ కలర్ లైన్‌ను ఎఫ్ఆర్ఎల్ అని అధికారులు స్పష్టం చేశారు. దీని ఆధారంగా మూసీ వెంబడి నిర్మాణాలకు మార్కింగ్ ప్రక్రియ చేపడుతున్నారు.

#### గీతలతో మారనున్న పేదల తలరాత

ప్రస్తుతం రివర్ బెడ్ అంటే రెడ్ మార్కింగ్ ప్రక్రియ జరుగుతుండగా.. రెడ్ మార్కింగ్‌లోనే 60 నుంచి 70వేల ప్రాపర్టీలు ఉన్నట్లు తెలిసింది. అదే ఫుల్ రివర్ లెవల్ పేరిట (బ్లూ లైన్) మార్కింగ్ ప్రక్రియ మొదలైతే ఈ సంఖ్య రెండు లక్షలకు చేరేలా హద్దులు ఖరారు చేశారు. బ్లూ లైన్ తర్వాత బఫర్ జోన్‌కు మరో 30 నుంచి 40 మీటర్ల దూరాన్ని గుర్తించాలని ఇరిగేషన్ నిపుణులు తెలిపారు. నిబంధనల ప్రకారం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులను నిర్ధారించాల్సి ఉండగా... ఇప్పటివరకు ఎఫ్ఆర్ఎల్ వరకు మాత్రమే ఎంఆర్‌డీసీఎల్ మార్కింగ్ చేసింది. దీనికి అదనంగా బఫర్ జోన్ కూడా ఉంటుందని చెబుతున్నారు.

#### లక్షన్నరకు పైగా నిర్మాణాలు..

మూసీ డెవలప్‌మెంట్ అలైన్‌మెంట్ మ్యాప్ అందుబాటులోకి రాక ముందు... మూసీకి ఇరువైపులా రివర్ బెడ్ పరిధిలో ఉన్న నిర్మాణాల సంఖ్య దాదాపు 30 నుంచి 40వేల మధ్య ఉంటుందని భావించారు. కానీ ప్రస్తుత మ్యాప్ ప్రకారం రివర్ బెడ్(రెడ్ లైన్) పరిధిలో వచ్చే నిర్మాణాల సంఖ్య 60 నుంచి 70వేలకు పెరిగే అవకాశం ఉంది. అలాగే ఎఫ్ఆర్ఎల్(బ్లూ లైన్) పరిధిలోకి వచ్చే ఆస్తుల సంఖ్య దాదాపు లక్షకు పైగానే ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. ఒక్కో చోట ఎఫ్ఆర్ఎల్ వెడల్పు 80 నుంచి 100 మీటర్ల దూరంలోనే ఉండగా... దీనికి అదనంగా బఫర్ జోన్ నిర్ధారించాల్సి ఉంటుంది. మూసీ ప్రక్షాళన పేరిట ఈ లెక్కన ప్రభుత్వం దాదాపు లక్షన్నరకు పైగా నిర్మాణాలను సుందరీకరణ పేరిట మూసీలో ముంచేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.





హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బాధితులు, సీపీఎం నేతలు

## ఖబడ్దార్.. రేవంత్

**ఇండ్లు కూల్చితే ఊరుకోం • మూసీ నిర్వాసితుల హెచ్చరిక**

**సీపీఎం .. ప్రజాసంఘాల మద్దతు**

**కలెక్టరేట్ ఎదుట మూసీ నిర్వాసితుల ఆగ్రహజ్వాలలు**

సిటీబ్యూరో/ఖైరతాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : ''మా ఇండ్లు నేలమట్టం చేసే అభివృద్ధి మాకక్కర్లేదు. సుందరీకరణ కోసం మేం నాశనం కావాలా? ఎవడో ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా మా ఇండ్లను కూల్చడానికి చూస్తున్నారా? ఎన్నో ఏండ్లుగా ఉంటున్నాం. అనేక వరదలు వచ్చాయి. మమ్మల్ని ఏ వరద ఏం చెయ్యలేదు. మమ్మల్ని మేం కాపాడుకుంటాం. మా ఇండ్లను కూల్చే అధికారం మీకెవరిచ్చారు. సీఎం డౌన్ డౌన్.. కూల్చివేతలు జరిగితే మూసీ నిర్వాసితులమంతా రేవంత్ మీ ఇంట్లో ఉంటాం. ఖబడ్దార్.'' అంటూ మూసీ నిర్వాసితులు హెచ్చరించారు. హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట సుమారు 200 మంది మూసీ నిర్వాసితులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. నిర్వాసితులకు మద్దతుగా సీపీఎం, ఇతర ప్రజా సంఘాలు నిలిచాయి. ఈ సందర్భంగా మూసీ సుందరీకరణతో కాంగ్రెస్ నాయకులు జేబులు నింపుకోవాలనుకుంటున్నారని నిర్వాసితులు ఆరోపిం చారు. ఇండ్లు లేని వారికి డబుల్ బెడ్ రూంలు ఇచ్చుకోండి.. తమకు అవసరం లేదని మూసీ నిర్వాసితుడు రమణ స్పష్టం చేశారు. మా ఘోస తగులుతుందని శారద అనే మహిళ కన్నీటి పర్యంతమైంది. సుందరీకరణ చేయాలంటే పేదల ఇండ్లే కావాలా.. తమను రోడ్డుపై పడేస్తారా అంటూ అంబర్‌పేట గోల్నాక మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. అనంతరం సీపీఎం నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం బస్తీవాసులతో ఎలాంటి చర్చలు జరుపకుండా రెండు రోజుల సమయం ఇచ్చి ఖాళీ చేయాలనడం దుర్మార్గమైన చర్య అన్నారు. మూసీ నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఎం.మహేందర్ మాట్లాడుతూ గోల్నాక డివిజన్‌లోని మూసీ పరీవాహక ప్రాంతంలో కూల్చివేస్తామన్న స్థలం ఎంతో ఎత్తులో ఉందని, ఇండ్లకు పట్టాలతో పాటు కరెంటు, నల్లా బిల్లు, ఆస్తి పన్నులు కడుతున్నారని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జి. రాములు, ఉమాదేవి, మల్లేశ్ గౌడ్, దుర్గా, మహేశ్, ప్రసాద్ రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

---




## సీజ్ చేశారు.. మళ్లీ తెరిచారు..

**అర్హత లేకున్నా డయాగ్నోస్టిక్ సెంటర్లు, క్లినిక్‌లకు తిరిగి అనుమతులు**

**వైద్యాధికారుల తీరుపై మండిపడుతున్న చౌడాపూర్ గ్రామస్తులు.. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్న జనం**

కులకచర్ల, సెప్టెంబర్ 30 : చౌడాపూర్ మండల కేంద్రంలో ఎలాంటి అనుమతి లేకుండా ఇంటర్ చదివినవారు డయాగ్నోస్టిక్ సెంటర్లు, ఆర్ఎంపీలు క్లినిక్‌లను నిర్వహిస్తున్నారని ఇటీవల ఆ గ్రామస్తులు జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు అనుమతి లేని డయాగ్నోస్టిక్ సెంటర్లు, క్లినిక్‌లను ఇటీవల అధికారులు సీజ్ చేశారు. ఇంకేముంది.. కాగా, ఆర్ఎంపీలు రాజకీయ నాయకుల అండదండలతో ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. అనుమతులు వచ్చాయంటూ మళ్లీ డయాగ్నోస్టిక్ సెంటర్లు, క్లినిక్‌లను తెరువడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆర్ఎంపీలు ఎంబీబీఎస్ డాక్టర్లు చేసే వైద్యాన్ని చేస్తున్నారని ఏ ప్రమాదం జరిగితే జిల్లా వైద్యాధికారులదే బాధ్యత అని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. అధికారులు ఎవరి ఒత్తిడిలకు లొంగవద్దని.. ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని ప్రజలు కోరుతున్నారు.

